# కామాచారి సమాధి

రాజారావు 40 ఎకరాల భూస్వామి. ఉన్న ఊళ్లోనే ఓ సినిమా హాలూ, రైసు మిల్లూ ఆయనకి ఉన్నాయి. తాత తండ్రుల నుంచి వచ్చిన ఆస్తిని తన ప్రయోజకత్వంతో పెంచి పెద్ద జేశాడు. మోటార్ బైక్ మీద ఎక్కి పొలానికో వేరే వ్యాపారాలకో వెళ్తున్నప్పుడు రోడ్డు పక్కల జనం వినయంగా గౌరవంగా నమస్కరించేంత మంచి పేరు ఆయనకి వుంది. భార్య అరుంధతి కూడా భర్తకి తగ్గ ఇల్లాలు- తమకు కలిగిందాన్ని పదిమందితో కలిసి పంచుకు తినాలన్న మంచి మనస్సు ఆమెది.

రాజారావుకి ఒక్కడే కొడుకు సుబ్రహ్మణ్య ప్రసాద్- ఏడు మైళ్ల దూరంలో ఇంగ్లీషు స్కూల్లో ఏడో క్లాసు చదువుతున్నాడు. రాములు గుర్రబ్బండి మీద రోజూ స్కూలు కెళ్లొస్తాడు ప్రసాద్.

నాలుగు నెలల నాడు ఓ విషాదం జరిగింది. స్కూల్ నుంచి వస్తున్న గుర్రబ్బండి ఇరుసు విరిగి బండి రోడ్డు పక్క తుప్పలోకి జారిపడిపోయి, బండి తోలే రాములు తలకి రాయి తగిలి... చనిపోయాడు-

గుర్రం... కాలు విరిగిపోయి- ఆక్రందనలు చేసింది.

సుబ్రహ్మణ్య ప్రసాద్‌కి స్పృహ పోయింది.

ఇంటికి చేర్చిన కొంత సేపటికి ఆ కుర్రాడు కళ్లు తెరిచి ఏడిచాడు-

అరక్షణంలో... ఏడుపు మానేసి నవ్వాడు. అయోమయంగా చూడ్డం, స్వయంగా... ఏ పనీ చెయ్యలేని నిరాసక్తత- వీడికి పిచ్చి ఎక్కిందా అని భయపడ్డారు.

పెద్ద పెద్ద డాక్టర్లకి చూపించారు.

మందులు ఇప్పిస్తున్నారు. అయినా ఫలితం కనిపించట్లేదు.

రక్షరేకులు, తాయత్తులు కట్టించారు.

దేవుళ్లకి మొక్కుకుంటున్నారు. అయినా మార్పేం లేదు.

తల్లిదండ్రులకే కాదు, ఊళ్లో అందరికీ సుబ్రహ్మణ్య ప్రసాద్ ఆరోగ్యం గురించి బెంగే.

ఓ రోజు ఇంట్లో పనిచేసే రత్తాలు మొహమాట పడుతూ-

"అమ్మగారూ... ఓ మాటంటాను. తప్పట్టుకోకండి... మీ దేవుడు వేరూ... మా దేవుడు వేరూ అనమాకండి- దేవుడెవరయినా కానీండి... చినబాబుగార్ని దేవుడే... మడిసిగా చెయ్యాలి" అంది అరుంధతితో.

"ఏం చెయ్యమంటావు... చెప్పవే"

"మీరేం చెయ్యద్దు. నేనే చర్చికెళ్లి బాబుగారికోసం ప్రార్థన చేస్తా- తప్పకుండా మంచి జరుగుతుంది. మీరు ఇక్కణ్ణుంచే... ప్రభువుకీ..."

"బలేదానివే... బిడ్డ బాగుకోసం... ఇన్ని హాస్పిటల్సు తిరిగా- ఇంతమంది దేవుళ్లకి మొక్కాం- ఇంకో దేవుడికి మొక్కడం తప్పేంటి- నేను బాబుని తీసుకుని చర్చికొస్తా..."

"అ...య్యా...గా...రూ..." కోప్పడతారేమోనన్నట్లు అనుమానంగా అడిగింది.

"నేను చెప్తా... ఆయన కాదనరు" అంది.

✦ ✦ ✦

భార్య చెప్పిన విషయం విని... తానూ చర్చికొస్తాననీ... బాబుకి నయమైతే నిలువెత్తు ప్రభువు విగ్రహాన్ని చేయించి చర్చికి ఇస్తానని అన్నాడు రాజారావు.

రోజులు గడుస్తున్నాయి. మందులూ- పూజలూ- ప్రార్థనలూ నడుస్తున్నాయి. సుబ్రహ్మణ్య ప్రసాద్ మరో నాలుగు నెలలు గడిచేప్పటికి కోలుకున్నాడు.

మొక్కిన దేవుళ్లందరికీ ముడుపులూ మొక్కులూ అన్నీ అందిస్తున్నారు.

చర్చిలో విగ్రహం తయారు చెయ్యడానికి కామాచారి గారికి బయానా ఇచ్చి పురమాయించాడు.

కామాచారి విగ్రహాల తయారీ విశిష్టంగా ఉంటుంది. వివిధ దేవుళ్ల విగ్రహాలు- రాజకీయ నాయకుడి బొమ్మలు జీవకళ ఉట్టిపడేలా చేయడం లో ఎంతో భక్తి ప్రపత్తులు వినియోగిస్తాడు... ఏసు ప్రభువు బొమ్మ

మొదటిసారి చేస్తున్నాడు! రాత్రి వినాయకుని పూజ చేసి... ఏసు ప్రభువు రూపాన్ని సుద్దతో చిత్రీకరించాడు. ఆ బొమ్మకి సభక్తికంగా మొక్కి శిల్పం చెక్కడం ప్రారంభించాడు. రాయిలో జీవం ప్రవేశిస్తోంది.

కరుణామయుడి కళ్లు- చెక్కిళ్లు- సహన హసనాల్లో వెలుగుతున్నట్లు మెరుస్తున్న సన్నటి పెదవులు- చిరుగెడ్డం- శిరోజాలు- నునుపు దేరిన సన్నటి నడుమూ- ఆ పక్కనే గాయపడ్డ వేటు- ఆజాను బాహువులూ- కాళ్లూ... అన్నీ పూర్తయ్యాయి... ఇంక మిగిలిన పని... అరచేతులూ! పాదాలూ! ఆ కరచరణాల మీద శిలువకి కొట్టినట్లు మేకులూ చెక్కాలి.

మనసు రావట్లేదు కామాచారికి- మిగిలిన బొమ్మకి నునుపులు సానబడుతూ... రోజులు గడిపేస్తున్నాడు.

ఆ మేకులు చెక్కాలంటే తనే శిలువ వేస్తున్నంత పాపం చేయడమే అని కుమిలిపోతున్నాడు.

రాజారావు కొడుకు పుట్టిన్రోజు నాటికి చర్చిలో విగ్రహాన్ని నిలబెట్టడానికి సన్నాహాలు చేసుకున్నాడు.

"ఒక్క రెండు రోజుల పని..." అంటూ వారంగా తిప్పుతున్నాడు... విగ్రహం త్వరగా పూర్చి చేసెయ్యమని రిక్వెస్టు చేస్తున్నాడు రాజారావు.

కామాచారి అశక్తత ఎవ్వరికీ అర్థం కాదు. తన బాధ... ఎవరితో చెప్పుకున్నా 'వెర్రివాడా' అన్నట్లు నవ్వేస్తున్నారు.

"రాజారావుగార్ని బాధ పెడితే ఊరంతా నిన్ను శిలువ వేసేస్తార్రా" అని బెదిరించారు.

గుండె రాయి చేసుకుని విగ్రహం పూర్తి చేస్తానని కూచునేవాడు-

కానీ ఆ మేకులు చెక్కాలంటే కళ్ళనీళ్లు తిరిగేవి. చేతులు వణికేవి. ఉలి, సుత్తి జారిపోయేవి... ఏడిచేడిచి ఎప్పుడో నిద్రలోకి జారిపోయేవాడు.

✦ ✦ ✦

"ఏవన్నారూ... కామాచారి చనిపోయాడా"

ఏదో అపశకునం జరిగినట్లు హుటాహుటిన కామాచారి ఇంటికి బైల్దేరాడు రాజారావు.

చుట్టూ జనం గుమిగూడి ఉన్నారు.

ఏసు ప్రభువు శిల్పం గోడకి నిలబెట్టబడి ఉంది.

కాళ్లూ చేతులూ అసంపూర్తిగానే ఉన్నాయి.

కామాచారి ప్రభువు విగ్రహం కాళ్ల దగ్గర తలపెట్టుకుని నేల మీద వెల్లకిలా పడివున్నాడు. రెండు చేతులూ బార్లసాచి శిలువ మీద ప్రభువు ఉన్న భంగిమలోనే ఉన్నాడు- అలాగే ప్రాణాలు కోల్పోయాడు.

✦ ✦ ✦

చర్చి ఫాదర్ వచ్చి చూశాడు. కామాచారిలో మహాభక్తుణ్ని చూసి పరవశించాడు.

అతనికి క్రైస్తవ ధర్మానుసారం అంత్యక్రియలు చేయించి చర్చి ప్రాంగణంలో అతని జ్ఞాపక చిహ్నం నిర్మించాడు.

ఆ అసంపూర్ణ విగ్రహాన్ని అలాగే చర్చిలో ప్రతిష్టించాడు రాజారావు.

ఆ చర్చికెళ్లి... ప్రభువు దర్శనం చేసుకునేముందు... అందరూ ముందుగా కామాచారి సమాధికి ప్రార్థన చేసి వెళ్తుంటారు.... ఇప్పటికి కూడా.